క్లుప్తంగా

సన్మార్గంలో పయనిస్తేనే ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

ఇల్లెందురూరల్: విద్యార్థి దశ నుంచి సన్మార్గంలో పయనిస్తేనే జీవితంలో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఇల్లెందు హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మారెడ్డి సూచించారు. బొజ్జాయిగూడెం ఆశ్రమ పాఠశాలలో మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్తు పదార్థాలకు, మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు.

ప్రభుత్వ స్థలం పరిశీలన



విద్యుత్ సబ్‌స్టేషన్‌కు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

జూలూరుపాడు: వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ కృషి ఫలితంగా ప్రభుత్వం కాకర్లలో విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేసింది. సబ్‌స్టేషన్ నిర్మాణానికి కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని శనివారం విద్యుత్, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. జూలూరుపాడు విద్యుత్ శాఖ ఏఈ సతీష్, గిర్దావర్ ఎం.తిరుపతిరావు, కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు అల్లాడి నరసింహారావు, అల్లాడి లింగారావు, వందనపు సత్యనారాయణ, ముత్తినేని గోపి, మెంతుల కృష్ణారావు, సతీష్ పాల్గొన్నారు.

శ్రమదానం



ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తున్న వలంటీర్లు

ఇల్లెందురూరల్: సుదిమళ్ల గ్రామపంచాయతీ జగదాంబగుంపు గ్రామంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు శనివారం శ్రమదానం చేశారు. గ్రామంలోని వీధులను శుభ్రం చేయడంతోపాటు పలుచోట్ల ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. సేకరించిన వ్యర్థాలను సమీపంలోని డంప్‌షెడ్‌కు చేర్చారు. ప్రోగ్రాం ఆఫీసర్ రాజు, అసిస్టెంట్ ప్రొఫెసర్ బి.సరిత, వలంటీర్లు పాల్గొన్నారు.

భూపేష్ మరింత ఎదగాలి



భూపేష్‌ను అభినందిస్తున్న సాబీర్‌పాషా

కొత్తగూడెంఅర్బన్: ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా సహాయ కార్యదర్శిగా ఎన్నికైన బరిగెల భూపేష్‌ను శనివారం కొత్తగూడెంలో జరిగిన కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా అభినందించారు. మాట్లాడుతూ... భూపేష్ సీపీఐ యువజన సంఘంలో చురుకైన పాత్ర పోషిస్తూ, పార్టీ అభివృద్ధితో పాటు క్రీడాకారుడిగా క్రీడాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని, అదేవిధంగా జర్నలిస్టుగా ప్రభుత్వానికి, ప్రజలకి మధ్య వారధిగా సామాజిక కార్యకర్తగా జిల్లాలో చురుకైన పాత్ర పోషిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్‌లో మరెన్నో ఉన్నత పదవులు పొందాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. వంగ వెంకట్, ఎస్వీ రమణమూర్తి, జి.వీరస్వామి, వి.మల్లికార్జునరావు, ఎస్‌కే హుమాయున్, మధుకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కొత్తగూడెంలోని ఇళ్లల్లో ఇంటీరియర్ డిజైనింగ్







పాల్వంచలోని ఓ ఇంట్లో ఆకట్టుకుంటున్న మోడళ్లు

ఇంటికి అందం.. ఇంటీరియర్

గతంలో ఇల్లు కట్టుకుంటే చాలు అన్నట్లుగా ఉండేది. మారుతున్న కాలానికి అనుగుణంగా ఇంటిలోపల (ఇంటీరియర్) డిజైన్స్‌పై ఆసక్తి చూపుతున్నారు. పారిశ్రామిక ఏజెన్సీ ప్రాంతమైన పాల్వంచ మండల, పట్టణంతోపాటు జిల్లాలోని ఇతక ప్రాంతాల్లో నూతనంగా ఇళ్లు నిర్మించుకునే వారు ఇంటిలోపల డిజైన్లపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఖర్చుకూ వెనుకాడటం లేదు. అభిరుచుల మేరకు ఎక్కువ మంది అధునాతన డిజైన్లపై ఆసక్తి చూపుతున్నారు.

- గృహాలంకరణపై పెరుగుతున్న మోజు
- డిజైన్‌లో యూపీ కార్మికులు
- జిల్లాలో వందల మందికి ఉపాధి



సండే స్పెషల్

పాల్వంచలో ఓ ఇంట్లో సీలింగ్, సెల్ఫ్‌ల డిజైనింగ్

పలువురికి ఉపాధి...

పాల్వంచరూరల్: ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పలువురు నైపుణ్యం కలిగిన కార్మికులు కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా ఇంటీరియర్ డిజైనింగ్‌లో ఉపాధి పొందుతున్నారు. కొత్త ఇంట్లో డిజైన్ బట్టి ఖర్చు పెరుగుతుంది. సామాన్య, మధ్య తరగతి, సంపన్నులు, రైతులు, వ్యాపారులు, ఉద్యోగులు సైతం గదుల్లో, హాల్, పూజగదిలో ఇలా ఏ గదికి ఆ గదిలో వివిధ డిజైన్‌ను ఆకర్షణీయంగా, సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. దీనికి అనుగుణంగా వివిధ రకాల డిజైన్లతో నయా ట్రెండ్ కొనసాగుతోంది. వాటి ధరలు కూడా డిజైన్‌లను బట్టి ఖర్చు పెరుగుతుంది. గతంలో స్టార్ హోటళ్లు, పెద్దపెద్ద దుకాణాలకు మాత్రమే పరిమితమయిన ఈ డిజైన్లు ప్రస్తుతం సామాన్యులకు కూడా అందుబాటులోకి వచ్చాయి. కొత్తగూడెం జిల్లా ఏర్పాటు తరువాత రియల్ ఎస్టేట్ వ్యాపారం అమాంతంగా పెరగడంతో చాలామంది డబ్బుకు వెనకాడడం లేదు. ఇళ్ల నిర్మాణాలు కూడా ఊపందుకున్నాయి. ప్రజల ఆసక్తిని గుర్తించిన కొందరు వ్యాపారులు పీఓపీతో వివిధ డిజైన్లలో గదులను తీర్చిదిద్దే కాంట్రాక్టును కూడా తీసుకుంటున్నారు. సాధారణంగా సింగిల్ బెడ్ రూం ఇంటికి సీలింగ్ డిజైన్‌కు రూ.60వేల ఖర్చువుతుంది. లేదంటే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, వివిధ కంపెనీల షీట్లతో చేయాలంటే రూ.80 వేలు - రూ.లక్ష వరకు ఖర్చు అవుతున్నట్లు ఇంటి యజమానులు చెబుతున్నారు. ఇంటీరియర్ డిజైన్‌కు ప్రాధాన్యత పెరగడంతో అవసరమైన షీట్లు, జిప్సం, యూఎస్‌జీ, పీఓపీ షీట్లు వంటి ముడి సరుకుల ధరలు కూడా పెరుగుతాయని కార్మికులు అంటున్నారు.

యూపీకి చెందిన యువకులు..

ఇంటీరియర్ డిజైనింగ్ నైపుణ్యం స్థానికులకు అంతగా రాకపోవడంతో ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన యువకులు వందల మంది వచ్చి జిల్లాలో పలుచోట్ల ఉపాధి పొందుతున్నారు. వీరు పండుగలకు, వీలు కుదినప్పుడు సొంత ఊళ్లకు వెళ్లి మళ్లీ వస్తుంటారు. కొంతమంది కుటుంబాలతో సహా ఇక్కడే నివాసం ఉంటున్నారు.

ఒక్కో ఇంటికి ఒక్కో డిజైన్...



మాది ఉత్తర్‌ప్రదేశ్‌లోని బలరాంపూర్ జిల్లా దూలపూర్ గ్రామం. ఇక్కడ అందరూ నూతనంగా నిర్మించిన ఇళ్లల్లో ఇంటీరియల్ డిజైన్ చేయించుకోవడానికి ఇష్టపడున్నారు. దీంతో మాకు పనులు దొరుకుతున్నాయి. డిజైన్ బట్టి డబ్బులు తీసుకుంటాం. ముడిసరుకు కూడా మేమే తెస్తాం.

– ఓంప్రకాశ్, ఇంటీరియల్ డిజైనర్, యూపీ

డిజైన్ ఆధారంగా ఖర్చు...



నేను ఉత్తర్‌ప్రదేశ్ నుంచి వచ్చి పది సంవత్సరాలు అయింది. ఇంటీరియల్ డిజైనింగ్ పనులు చేస్తూ ఇక్కడే ఉంటున్నాను. ఇళ్లల్లో ఇంటీరియల్ డిజైనింగ్ చేయించుకోవాలనుకుంటే డిజైన్ బట్టి ఖర్చు పెరుగుతుంది. డబుల్ బెడ్‌రూమ్ ఇంటికి రూ.50వేల వరకు కూలీల ఖర్చు వస్తుంది.

– హరీష్ ప్రజాపతి, యూపీ

టేకు జాయ్ డిజైన్ చేస్తా..



మాది పాల్వంచ. తొమ్మిదో తరగతి చదువుకున్నా. పెయింటింగ్ నేర్చుకున్నా. సిమెంట్‌తో నిర్మాణం చేసిన ఆర్చీలకు టేకు జాయ్ డిజన్ చేస్తా. టేకు చెక్కను తలపించే విధంగా ఉంటుంది. తక్కువ ఖర్చుతో ఆర్చీలకు రంగులు వేసిన తర్వాత గుర్తుపట్టలేనంగా నిజమైన చెక్కలా ఉంటుంది.

– బాలస్వామి, పాల్వంచ

ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం



మాట్లాడుతున్న ఎంఈఓ స్వామి

ఇల్లెందురూరల్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా సమష్టిగా శ్రమించాలని ఎంఈఓ స్వామి సూచించారు. మండల విద్యావనరుల కేంద్రంలో శనివారం ప్రధానోపాధ్యాయులు, కార్యాలయ సహాయక సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సంస్కరణలు చేపడుతోందన్నారు. ఇందులో భాగంగా ప్రతీ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు నిత్యం రెండు పాఠశాలలను సందర్శించాలని, ప్రార్థన సమయం కంటే పది నిమిషాల ముందే ఉపాధ్యాయులు పాఠశాలకు హాజరు కావాలని, నూరు శాతం విద్యార్థుల హాజరు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని, మధ్యాహ్న భోజనం అమలును ప్రతీరోజు పర్యవేక్షించాలని, వంట గది శుభ్రంగా ఉండేలా చూడాలని, విద్యార్థులకు వేడి ఆహారం అందించేలా చర్యలు తీసుకోవాలని, క్రమం తప్పకుండా పాఠశాలల కమిటీ సమావేశాలు నిర్వహించాలని, విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంచేలా ఉపాధ్యాయులకు ఎప్పటికప్పుడు మార్గనిర్దేశం చేయాలని, పాఠశాలల్లో నిర్వహించే కార్యక్రమాలలో స్థానిక ప్రజాప్రతినిధులను, స్వచ్ఛంద సంస్థలను భాగస్వాములను చేయాలని, విద్యార్థి ప్రగతి లక్ష్యంగా తీసుకునే కార్యక్రమాలపై తల్లిదండ్రుల సమావేశాలలో సమగ్రంగా వివరించాలని సూచించారు.

నేడు ఏఐటీయూసీ జిల్లా మహాసభ

జూలూరుపాడు: కొత్తగూడెంలో ఆదివారం జరగనున్న ఆటోవర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) జిల్లా మహాసభను జయప్రదం చేయాలని ఆటోవర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి నిమ్మటూరి లచ్చయ్య పిలుపునిచ్చారు. శనివారం జూలూరుపాడులో మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటో, క్యాబ్ డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఆటో, క్యాబ్ డ్రైవర్లకు నెలకు రూ.12 వేలు ఆర్థిక సాయం అందించి, ఆదుకోవాలని కోరారు. జిల్లా మహాసభకు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్‌పాషా, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, జమలయ్య హాజరుకానున్నట్లు చెప్పారు. ఈ సభకు ఆటో కార్మికులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

ఎస్‌ఎఫ్‌ఐ పూర్వవిద్యార్థుల సమ్మేళనం



మాట్లాడుతున్న ఆదాం

జూలూరుపాడు: ఖమ్మంలోని ఎస్‌ఆర్ గార్డెన్స్‌లో ఆదివారం జరగనున్న ఎస్ఎఫ్ఐ పూర్వవిద్యార్థుల సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు మోదుగు ఆదాం పిలుపునిచ్చారు. శనివారం జూలూరుపాడు సీపీఎం కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి ఉద్యమ ప్రభావంతో ప్రజానాయకులుగా రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణిస్తున్నారన్నారు. ఖమ్మంలో సమ్మేళనానికి ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థులందరూ హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో వల్లమల చందర్‌రావు, గార్లపాటి పవన్‌కుమార్, పూర్వ విద్యార్థులు వేల్పుల నరసింహారావు, కృష్ణప్రసాద్, దేవరకొండ కిరణ్ పాల్గొన్నారు.

చెత్త బండ్ల అడ్డగింత



చెత్త బండ్లను అడ్డుకుంటున్న స్థానికులు

పాల్వంచ: పట్టణ పరిధి పాత పాల్వంచ వద్ద చెత్త బండ్లను శనివారం స్థానికులు అడ్డుకున్నారు. మున్సిపాలిటీలో సేకరించిన చెత్తను పాత పాల్వంచ ఎస్సీ కాలనీ శ్మశానవాటికలో వేస్తూ డంపింగ్ యార్డ్‌గా మారుస్తున్నారంటూ మున్సిపల్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికులు మాట్లాడుతూ.. చెత్తను తెచ్చి ఇక్కడ పడేయడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని, ట్రాక్టర్లు, ఆటోలు రాకపోకలు సాగిస్తుండటం, చెత్త డంప్‌ల వద్ద దుర్గంధం వెదజల్లి అనారోగ్యాల బారిన పడుతున్నామని వాపోయారు. దీంతో పట్టణ ఎస్ఐ సుమన్, మున్సిపాలిటీ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌రావు అక్కడికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. దీంతో శనివారం సాయంత్రం వరకు చెత్త బండ్లు అక్కడే నిలిచిపోయాయి.

తొలగిన నీటి కష్టాలు

ఇల్లెందు: ఇల్లెందు పట్టణంలోని జేకే సింగరేణి కాలనీలో స్థానికులు కొంతకాలంగా తీవ్రంగా నీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మేరకు జీఎం జాన్‌ఆనంద్ చర్యలు తీసుకున్నారు. డీ బ్లాక్ నుంచి జేకే సివిల్ ఆఫీస్ వరకు కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేయించారు. జేకే కాలనీ, ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో నీటి సమస్య తీరింది. ఈ సందర్భంగా అక్కడి కార్మికులు వారి కుటుంబ సభ్యులు జీఎం జాన్ ఆనంద్ కృతజ్ఞలు తెలిపారు.

బీజేపీ నాయకుల సంబురాలు



అంబేద్కర్ సెంటర్‌లో సంబురాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకులు



స్వీట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

పాల్వంచరూరల్: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి విజయం సాధించడం పట్ల పాల్వంచలో బీజేపీ నాయకులు శనివారం స్వీట్లు పంపిణీ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక దమ్మపేట సెంటర్‌లో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పానిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడారు. దేశ ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారని భవిష్యత్‌లో కూడా ఎన్‌డీఏ కూటమి మిగిలిన రాష్ట్రాల్లో జరిగే ఎన్నికల్లో విజయం సాధిస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో గంధం ప్రసాద్‌గౌడ్, నర్సదాస్, కటికల రంజిత్, మాదారపు లక్ష్మణ్, మాలోతు ప్రశాంత్, నందిగం వెంకటరమణ, రాము, కిట్టు, వినయ్, విజయ్, ప్రభాకర్, సత్యం, శేఖర్, రాము తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు నివాళులు..

మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల్లో బీజేపీ కూటమి విజయం సాధించడం పట్ల బీజేపీ నాయకులు కన్వీనర్ బుడగం రవికుమార్ శనివారం స్థానిక అంబేద్కర్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసి బాణాసంచా పేల్చి సంబురాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎడ్లపల్లి శ్రీనివాస్‌కుమార్, రాజు, సుధాకర్, వీరన్న, రంజిత్, రవినాయక్, గిరిగౌడ్, శ్రీను, తిరపతయ్య, బాలు, ధనలక్ష్మి, లక్ష్మణ్, నరేష్, కుమార్, ప్రతాప్, రాపాక రమేష్, పాషా, ఆనంద్, ప్రసాద్, హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడం పట్ల బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ.. తెలంగాణ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, కాంగ్రెస్ నాయకులు మహారాష్ట్ర వెళ్లి ఎన్నికల ప్రచారం చేసినప్పటికీ అక్కడి తెలుగు ఓటర్లు నమ్మలేదని, బీజేపీకే ఎక్కువ సీట్లు కట్టబెట్టారన్నారు. కార్యక్రమంలో నున్నా రమేష్, ఎం.సతీష్, తెల్లం నరసింహారావు, సిరిపురపు ప్రసాద్, భూక్యా శ్రీను, రాజేష్, వెంకటేశ్వర్లు, గోపాల్‌రావు పాల్గొన్నారు.

వెన్నెల నియామకంపై హర్షం



నినాదాలు చేస్తున్న విద్యార్థులు

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ సాంస్కృతిక సారధి చైర్‌పర్సన్‌గా డాక్టర్ గుమ్మడి వెన్నెల నియమితులు కావడం పట్ల కొత్తగూడెంలో గాంధీపథం ఆధ్వర్యంలో శనివారం సింగరేణి పాఠశాలలో హర్షం వ్యక్తం చేస్తూ, అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీపథం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు చింతలచెర్వు గెర్షోము మాట్లాడుతూ... ఇకపై తెలంగాణ సాంస్కృతిక కార్యక్రమాలు రాష్ట్ర అభివృద్ధి పథంలో దూసుకెళ్తాయని ఆశభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గాంధీపథం చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు జ్ఞానవినోదిని, శ్రీనివాస్, ప్రకాశ్ జాన్, పుష్పావతి, వీరయ్య, ఎలిజిబెత్, సాహిత్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలే ప్రగతికి మెట్లు



మాట్లాడుతున్న ఎంఈఓ ప్రభుదయాళ్

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మండల రిసోర్స్ కేంద్రంలో మండలంలోని అన్ని పాఠశాలల హెచ్‌ఎంలతో విద్యాశాఖాధికారి డాక్టర్ ప్రభుదయాళ్ శనివారం రివ్యూ సమావేశం నిర్వహించారు. ప్రతీ పాఠశాలలో చేపట్టిన విద్యాపర కార్యక్రమాలను, పథకాలపై విశ్లేషించారు. డీఎస్సీ – 24 ద్వారా నూతనంగా చేరిన వారికి దిశా నిర్దేశం చేశారు. వచ్చేనెల 4న న్యాస్ పరీక్షకు 3 ,6, 9 తరగతుల విద్యార్థులను సన్నద్ధం చేయాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల గ్రాంట్లు, సర్వ శిక్ష గ్రాంట్లు ఏ విధంగా, వేటి కోసం ఖర్చు చేయాలో వివరించారు. వచ్చే నెల నుంచి అకడమిక్ వార్షిక పర్యవేక్షణలు నిర్వహించనున్న దృష్ట్యా అన్ని రికార్డులను నిర్వహించాలని సూచించారు. అపార్‌లో విద్యార్థుల వివరాలను వచ్చేనెల 9 లోపు విధిగా తప్పులు లేకుండా నమోదు చేయాలన్నారు. వచ్చేనెల 2వ తేదీలోపు కలెక్టరు సూచించిన శానిటేషన్ కిట్‌ను ప్రతీ పాఠశాలలో కొనుగోలు చేసి పాఠశాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. విద్యాంజలి ఆప్‌లో నమోదును వచ్చేనెల 9 లోపు పూర్తి చేయాలన్నారు. మధ్యాహ్న భోజన విషయంలో హెచ్‌ఎంలు, టీచర్లు అంతా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ మెనూ ప్రకారం వడ్డించేలా చూడాలన్నారు. తేడా వస్తే అందరిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్‌పీలు, ఎంఆర్‌సీ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచండి..



మాట్లాడుతున్న యాకుబ్‌షావలీ

ఇల్లెందు: బొగ్గు పరిశ్రమలో పని చేస్తున్న 30 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 4 నుంచి 10 వరకు దశలవారీగా ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు టీయూసీఐ జిల్లా కార్యదర్శి యాకుబ్‌షావలీ తెలిపారు. శనివారం ఇల్లెందులో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. 56 డిపార్ట్‌మెంట్లలో 30 వేల మంది కార్మికుల పని చేస్తున్నట్లు చెప్పారు. ఏడు సంవత్సరాలుగా వేతనాలు పెంచలేదన్నారు. తక్షణం కార్మికుల వేతనాలు పెంచి వారిని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ నాయకులు మల్లెల వెంకటేశ్వర్లు, వేముల గురునాథం, వెంకట్, రఘు, మూడు సంజీవ్, సుమంత్, రామకృష్ణ, బాలు, ఉపేందర్, రమేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జీఎంను సన్మానం..

సింగరేణి 24 ఏరియా రన్స్ అండ్ గోల్స్ స్టేడియంలో శనివారం వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో జీఎం జాన్ ఆనంద్‌ను ఘనంగా సత్కరించారు. జేకే గ్రౌండ్, 24 ఏరియా గ్రౌండ్‌లో సకల సదుపాయాలు కల్పించి తీర్చిదిద్దారని వాకర్స్ సభ్యులు, టీయూసీఐ జిల్లా కార్యదర్శి యాకుబ్‌షావలీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు జనార్దన్, ఐలయ్య, రాజారాం, ప్రభునాథ్, పాలెపు ఆనంద్, రాజు పాసీ, చాట్ల గణపతి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి కీర్తిని ఇనుమడింపజేయాలి



కప్ అందజేస్తున్న రజాక్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి వ్యాప్తంగా ఎక్కడ క్రికెట్ టోర్నీ జరిగినా కొత్తగూడెం సింగరేణి టీమ్ విజయం సాధించేలా నైపుణ్యం సాధించాలని కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ అన్నారు. శనివారం కొత్తగూడెం ఏరియా పరిధిలోని ప్రొఫెసర్ జయశంకర్ గ్రౌండ్‌లో ఆల్ ఏరియా ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్స్ ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ క్రీడలకు ఎంతో ప్రాధాన్యం కల్పిస్తూ ప్రతీ ఏటా రూ.కోట్లు ఖర్చు చేస్తోందని, తద్వారా ప్రతీ ఉద్యోగి ఏదో ఒక ఆటపై మక్కువ పెంచుకుని ఆడాలని సూచించారు. నిత్యం ఆటలు ఆడటం ద్వారా శరీరంలో రక్త ప్రసరణ పెరిగి మెదడు చురుకుగా పనిచేస్తుందని, శరీరంలో ఏమైనా రుగ్మతలు ఉన్నా నివారణ సాధ్యమవుతుందన్నారు. 11 ఏరియాల ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు క్రికెట్ పోటీలో శ్రీరాంపూర్ ఏరియా రన్నర్‌గా, కార్పొరేట్ ఏరియా విజేతగా నిలిచారు. వీరిని రజాక్ అభినందించి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జ్ఞాపికలను క్రీడాకారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వై.గట్టయ్య, క్రీడాకారులు మోహన్‌రెడ్డి, రాంబాబు, సంపత్‌కుమార్, భాష, శాంతమూర్తి, ఈశ్వర్, రవిచంద్ర, ఈశ్వర్, అర్జున్ పాల్గొన్నారు.

డిసెంబర్ 1న సింహగర్జన

జూలూరుపాడు: డిసెంబర్ 1న హైదరాబాద్‌లో జరగనున్న మాలల సింహగర్జన సభ వాల్ పోస్టర్లను శనివారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ చేతుల మీదుగా కొత్తగూడెంలోని ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాల మహానాడు మండల అధ్యక్షుడు బడుగు వీరస్వామి మాట్లాడుతూ... మాలల సింగర్జన సభను జయప్రదం చేసేందుకు మాలలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాల మహానాడు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కాశిమళ్ల రజనీబాబు, కల్లోజి దినేష్, మందా కమలాకర్, కల్లోజి వెంకటి, మందా పుల్లయ్య, గత్తం బన్ను, పణితి గోపాలకృష్ణ, వేమూరి బాలయ్య, పసుపులేటి పవన్, మందా గోపయ్య పాల్గొన్నారు.

వ్యాపారులూ.. రోడ్డు దిగండి



మాట్లాడుతున్న చైర్మన్ డీవీ



హాజరైన చిరువ్యాపారులు

- మోడల్ మార్కెట్‌లో గదుల కేటాయింపు
- చైర్మన్ డీవీ, కమిషనర్ శ్రీకాంత్, మేనేజర్ అంకుషావలీ
- పట్టణంలోని చిరువ్యాపారులతో సమావేశం

ఇల్లెందు: ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా రోడ్డు మీద చిరువ్యాపారాలు తగవని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ స్పష్టం చేశారు. ఐతా ఫంక్షన్ హాల్‌లో పట్టణంలోని కూరగాయలు, పూలు, పండ్లు, ఇతర చిరువ్యాపారులతో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. రూ.9 కోట్లతో నిర్మించిన మోడల్ మార్కెట్‌లో 192 గదులు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. వ్యాపారుల నుంచి అభిప్రాయ సేకరణ చేసి గదులు కేటాయించనున్నట్లు తెలిపారు. ఇక మీదట పట్టణంలో రోడ్ల మీద చిరువ్యాపారాలను తరలించాలన్నారు. ఇప్పటికే మార్కెట్‌లో ఉన్న వ్యాపారులకు ముందుగా గదులు కేటాయిస్తామని, ఆ తరువాత ఇతరులకు కేటాయించనున్నట్లు తెలిపారు. మటన్, చికెన్, చేపలతోపాటు పూలు, పండ్లు ఇతర చిరువ్యాపారులంతా ఒకేచోట ఉంటే వినియోగదారులను ఆకర్షించేవిధంగా ఉంటుందని పేర్కొన్నారు. పట్టణంలో రోడ్డు వెడల్పు చేసి డివైడర్ నిర్మాణం గావించినప్పటికీ చిరు వ్యాపారులు రోడ్ల మీద వ్యాపారం సాగించటం వల్ల ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటున్నట్లు చెప్పారు. ఇదిలా ఉండగా కిరాయిలు ఎక్కువగా ఉన్నాయని, పై అంతస్తులో వ్యాపారం ఇబ్బంది అవుతుందని పలువురు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. సొంత గదులు ఉన్నవారు కూడా మోడల్ మార్కెట్‌లోకి వచ్చి వ్యాపారం చేసుకోవటం సాధ్యం కాదని మటన్, చికెన్ దుకాణదారులు పేర్కొన్నారు. కొంతమందిని తరలించి కొంతమందిని వదిలేస్తే తమకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని పలువురు పూలు, పండ్ల వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా మార్కెట్‌లో జీవిస్తున్న తమకు గదుల కిరాయిలు పెంచి అన్యాయం చేయొద్దని చెప్పుకొచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ అంకుషావలీ, ఆర్‌ఐ శ్రీనివాస్, టీపీబీఓ సతీష్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.